ఇండియాటుడే - 3, జూన్ 2003

# తలవంచక తప్పదా!

నేను లక్ష్మికి అన్యాయం చేశానా? నలభై ఏళ్ళ కాపురంలో ఆమెకు నేను అందించింది - వట్టి అన్యాయమేనా? అసలు లక్ష్మి నాతో సుఖపడలేదా? నా విసుగుతో, పంతంతో ఆమె దిగజారిపోయిందా? నిజానికి నా కొడుకూ కూతురూ, కోడలూ, అల్లుడూ ఆమెకు సరిరారు కదా! ఈ విషయం ఎవరిని అడగాలి? ఈ ప్రశ్నలకు జవాబులు కటువుగా వస్తే, తద్వారా నాకు కన్నీళ్ళు వస్తే అవి నేను మోయగలనా? అంత శక్తి ఇప్పుడు నాకు ఉందా?

నిజమే. ఆమె నన్ను సుఖపెట్టిన క్షణాలు, రోజులూ తప్ప నేను ఆమెను సుఖపెట్టిన ఘడియలు నాకెందుకు గుర్తు రావడం లేదు! పదే పదే ఆమెతో ఘర్షణ పడ్డ రోజులు, నేను చేసిన చాలా పన్లు, నా ప్రమేయం కించిత్ లేకుండానే విఫలమవుతుంటే, వాటితో ఘర్షణ పడుతూ నేను ఆమెను దూషించిన మాట నిజమే! బహుశా నాకు తెలియకుండానే నేను తప్పు చేశానా?

అవును. ఆమెను మధ్య మధ్య అక్కున చేర్చుకోలేదు నేను. పైగా "ఇందుకు బాధ్యురాలివి నువ్వే కాదు, నేనూ అయ్యుంటాను" అని ఉంటే ఎంత బావుండేది. ఎన్నో మాటలు నేర్పిన నోరు ఎందుకు మూసుకుపోవాలి? నాకు జ్ఞానోదయం ఆలస్యంగా రావడం నా దురదృష్టం అయి ఉండాలి. ఇంకా పోతే బాధ మిగలడం అదో దురదృష్టం అయ్యుంటుంది. అందుకోసమే ఈ బాధ నన్ను కాలుస్తోంది.

నిజమే. ఇల్లు సర్దలేనప్పుడు, నా ఆర్థిక స్థితిగతులు అంతంత మాత్రమే అయినప్పుడు అటు మా అమ్మ, ఆమె పోయిన తర్వాత నా పిల్లలు వరుసగా నా మాట విననప్పుడు నేను నా లక్ష్మిని విసుక్కున్నాను. కసురుకున్నాను. అయినా లక్ష్మి ఎప్పుడో గానీ మాట్లాడేది కాదు. ఒకసారి కాబోలు అంది, నాకు ఇంకా గుర్తు. "మిమ్మల్ని ఎలా నమ్మించాలో ఈనాటి వరకూ నాకు అర్థం కాలేదు. అందుకే నేను తక్కువ మాట్లాడ్డం కావాలని ఓ అలవాటుగా చేసుకున్నాను. మీరు నన్ను ఇంతే అర్థం చేసుకున్నారన్న రోజు మీ మీద నాకు కోపం వచ్చేది కాదు. నా అదృష్టం ఇంతేనేమో అనుకుంటేనే నాకు శాంతిగా ఉండేది. అది తప్ప నాకు మరో మంచి మార్గం కనిపించలేదు. ఉందనీ అనిపించలేదు.

అందరి కాపురాలు ఎలా వెడుతున్నాయో నాకే కాదు. మీకూ తెలుసు. కానీ, ఆ అందరిలో కొందరి కాపురాలు అందుకు విరుద్ధంగా పోతుంటాయి? అందులో మనదొకటేమో! ఇంట్లో జరిగిన ప్రతి దానికీ భార్యను విసుక్కునే వాళ్ళు కోట్లాది మంది ఉన్నారు. అందులో నా సంసారం ఒకటి, నేను ఒకత్తిని అని అనుకున్ననాడు నాకు కాస్త శాంతిగా ఉన్నట్టు అనిపించేది. చాలామంది ఆడవాళ్ళు పుట్టింటి నుంచి ఆస్తులు, వస్తువులూ తెస్తారు. నేను అటువంటిదేమీ తేలేదు. నేను ఒంటరిగా వచ్చాను. కానీ, నేనేం తెచ్చానో నాకన్నా మీకే ఎక్కువ తెలుసు."

"చాల్లే నీ తెలివితేటలు. నాకు బాగా తెలుసు. మధ్యన నీ ఆర్థిక స్థితిగతులు ఎత్తిందెవరు? విషయం మళ్ళిస్తావు దేనికీ!"

"నేనేం మళ్ళించలేదు. నిజం చెబుతున్నాను" అంటూ లక్ష్మి మరోసారి ఆవులించింది. దుప్పటి ముసుగేసింది. ఈ లోకంతోనాకు పనేమిటి అన్నట్టుగా!

అప్పుడు నాకు ఈ గొడవకు కారణం అయిన రాజు, విమల గుర్తుకు వచ్చారు. సగం కోపం లక్ష్మి మీదకు, మిగతా సగం నా పిల్లలైన వాళ్ళ మీదకూ మళ్ళింది. రాజు ముప్పయ్యేళ్ళ పెళ్ళికొడుకు. నా పెద్ద కొడుకు. పెళ్ళి చేసుకోమని మేం బతిమలాడి ఏడ్చి మొత్తుకున్నా ఏడాదికి ఆరు చొప్పున తనకు నచ్చనట్టుగా ఉత్తరం రాసిన ప్రబుద్ధుడు. అలాంటిది ఇప్పుడు ఓ అమ్మాయిని తాను ప్రేమించినట్టూ, తాము అంగీకారం చెబితే పుస్తె కడతానని, ఆమె మనసంతా దోచి ఊరుకోకుండా శరీరానికి గిలిగింతలు పెడుతోందని ఏవేవో రాశాడు. విమలా అంతే. ఎదురింటి రాజశేఖరం అంటే తనకి ఇష్టం అనీ, అతనికి తానంటే మరీ ఇష్టం అనీ తల్లితో ఏవేవో చెప్పిందిట!

"నీకేమనిపిస్తోంది? వీళ్ళ వరసయితే నాకు నచ్చలేదు. ఈ రోజుల్లో ప్రేమకు కట్టుబడి ఉండేది ఎంతమంది? రూముల్లో ఉంటూ దారిని పోయే ప్రతి అమ్మాయినీ ప్రేమించాం అనుకుంటారు. వీళ్ళ అసలు సంగతి ఇప్పుడు కాదు తెలిసేది. వీళ్ళ విశ్వరూపం పెళ్ళి అయిన తర్వాత చూపిస్తారు."

"మన అమ్మాయి ముఖ్యంగా రాజూ అటువంటి వారు, కాదు."

"నువ్వెలా బరోసా ఇవ్వగలవు?"

"నా పిల్లల సంగతి నాకు తెలియదా?" అంది చిన్నగా నవ్వుతూ లక్ష్మి.

"వాళ్ళు ప్రేమించినవాళ్ళు పైగా అవతలివాళ్ళు ఎటువంటివారో నీకుతెలియదు కదా? మనం నాలిక కరుచుకున్నా, నెత్తి మొత్తుకున్నా ఆ రెండు ప్రక్రియలూ వేరు. కానీ, ఈ ఇంటిలో అశాంతికి తెరలేవడం అదీ నీ వల్ల జరగకూడదు"

"ప్రేమించింది వాళ్ళు, నేను కాదు కదండీ" అంది నవ్వుతూ లక్ష్మి మరోసారి.

"చాలు నీ తెలివితేటలు. వాటిని ఇప్పటికయినా నువ్వు ఆపితే బావుంటుంది. వాళ్ళు బహుశా నీ బరోసాతోనే ఈ పని చేసి ఉంటారు. నాకు తెలుసు. నువ్వెందుకు మెత్తగా

ఉంటున్నావు? నాకు వాళ్ళు కాదు. మెత్తని శత్రువు నువ్వు" కోపంగా అనేశాను.

లక్ష్మి మాట్లాడలేదు.

"నువ్వు ఇప్పటికయినా వాళ్ళ స్వేచ్ఛకి అడ్డుకట్టలు వేయి. ఈప్రేమలూ, పెళ్ళిళ్ళూ నాకు ఇష్టం లేదు" అంటూ ఓ గంట లక్ష్మికి చెప్పాను. అయినా లక్ష్మి మాట్లాడలేదు. నా విసుగును, తిట్లను, కోపాన్ని అన్నిటినీ భరించింది.

"నువ్వు వాళ్ళకి ఎలా నచ్చచెబుతావో నీ ఇష్టం" అనేసి నేను లక్ష్మి పక్క నుంచి లేచాను. నా డ్రాయింగ్ రూమ్‌లో మడత మంచం మీద పడుకున్నాను. ఓ రాత్రి దాకా నాకు నిద్ర పట్టలేదు. అటూ యిటూ దొర్లాను. లేచి తిరిగి నా గదికి వెళ్ళాను. అక్కడా పడుకో బుద్ధేయలేదు. నేను ఓ సారి చూసినప్పుడు లక్ష్మి తల్లి పక్షిలా తన పిల్లల్ని అదుముకుని నిద్రపోతూ కనిపించింది. మరో గంట తర్వాత తన గదిలో బెడ్‌రూమ్‌లో లైట్ వెలిగించుకుని తలవంచుకుని ఏదో ఉత్తరం రాస్తూ కనిపించింది.

"ఆ రాజుగాడికి బాగా గడ్డిపెట్టు. అంతేగానీ మెతకగా రాయకు. తెలిసిందా" అనేశాను.

అయినా లక్ష్మి మాట్లాడలేదు. ఓ సారి నా వైపు చూసిందంతే.

❖ ❖ ❖

రాజు సునీతను, విమల శేఖరాన్ని పెళ్ళి చేసుకున్న విషయం ఆ పెళ్ళిళ్ళు రెండూ అయ్యేంతవరకూ నాకు తెలియలేదు. రాజు రిజిష్టర్ మ్యారేజ్ మద్రాసులో అయింది. విమల శేఖర్‌తో ఇంట్లోంచి వెళ్ళిపోయి పెళ్ళి చేసుకుని ఏమీ తెలియనిదానిలా భర్తను వెంటబెట్టుకుని నా ఇంటికి వచ్చింది. నాకు కోపం ఆగింది కాదు. వాళ్ళిద్దరూ ఓ జంటలా కాదు, నన్ను చూసి 'నువ్వేం చేయగలవు' అని సవాల్ చేస్తున్నట్టు అనిపించింది. నాకు కోపం ఉవ్వెత్తున లేచింది.

"నేను కట్నం యిచ్చి సజావుగా పెళ్ళి చేయలేని మనిషిగా నీకు అనుమానం వచ్చి ఉండాలి. అందుకే ఈ పని చేశావ్. కానీ, నేను నీకు అన్నం కూడా పెట్టలేనివాడినని అందరి ముందూ నువ్వు రుజువు చేయదల్చుకున్నావేమో? ఇంతదూరం వచ్చిన తరువాత పంతం నీకే కాదు, నాకూ ఉంటుంది. నువ్వు అతనితోపాటు ఎటు వెళ్ళినా, ఏం తిన్నా నేను పట్టించుకుంటే అది పాపమే అవుతుంది. మరో విషయం, నీ అన్నయ్యకు కూడా ఈ మాటలే చెప్పదల్చుకున్నాను. నీకు ఇచ్చిన గౌరవమే వాడికీ ఇస్తాను. వాడి డబ్బు తినకూడదని నిన్న రాత్రే నేనో నిర్ణయానికి వచ్చాను."

"వాడి సంగతి వదిలేయండి. ఇది మన పిల్ల, మన ఆడపిల్ల. మీరు అలా అనొద్దు. నిజమే. అది పొరపాటు చేసింది. కానీ, మనం దాన్ని వదిలేశామని తెలిస్తే అది ఊరూ వాడే కాదు, ముఖ్యంగా అత్తింట లోకువవుతుంది. ఆడపిల్లకు డబ్బు, దర్పం ఏం పోయినా ఫర్వాలేదు. కానీ, పుట్టిల్లు పోకూడదు. రేపు దానిని ఆదరించేవాళ్ళు ఎవరు? పురుడొచ్చి పిల్లను కంటే దాన్నీ, ఆ పిల్లనూ అక్కున చేర్చుకునేదెవరు? మనమే కాదంటే అందరూ

దాని చిన్న తప్పును పెద్దది చేసి నవ్వుతారు. మీరు కోపం మానండి, క్రోధం మానండి. మిమ్మల్ని తెలిసో, తెలియకో వాళ్ళు అవమానం చేశారు. కాని, అన్నీ తెలిసిన మీరు వాళ్ళని అవమానం చేయొద్దు. అనాధల్ని చేయొద్దు. నా మాట వినండి" అంది రుద్ధ కంఠంతో లక్ష్మి.

నాకు కోపం ఆగింది కాదు. నా ఎదురుగా కూతురు, అల్లుడు నిలుచున్నారని మర్చిపోయాను. లక్ష్మివైపు చూశాను. అప్పుడు నా కోపం రెట్టింపే అయింది.

"నువ్వు నాకు చెప్పొద్దు లక్ష్మి. ఈ ఇంట్లో పిల్లలు ఇలా ఊరికే తెగించరు. పరోక్షంగా నువ్వో, మరెవరో వారికి సహాయ సహకారాలు అందించి ఉండాలి."

"నేనేం చేశానో, చేయలేదో ఆ భగవంతుడికే తెలుసు. ప్లీజ్ మీరు నా మాట నమ్మండి."

"ఎక్కడ చూడు, డబ్బున్నవాళ్ళున్నవాళ్ళు అణగిమణగే ఉంటున్నారు. తల్లిదండ్రులు తెచ్చిన సంబంధానికి తల ఊపుతున్నారు. కానీ, డబ్బు లేని వీళ్ళ ధైర్యం వెనక ఉన్నదేమిటి? ప్రేమించామని గుండెలు బాదుకునేవారు ముందుగా తెలుసుకోవలసింది ఒకటి ఉంది. అది -ప్రేమ చాలా త్యాగాలు కోరుతుందనే విషయం. మనుషులు, కన్నవాళ్ళు డబ్బు వేటినీ లెక్కచేయరు. దేనికీ భయపడరు. అయితే, వీళ్ళది వ్యామోహమే గానీ ప్రేమ కాదు. వీళ్ళకు తాము చేసింది పొరపాటు అనే భయం ఉంది కాబట్టే ముందు మనింటికి వచ్చారు. దేనికంటావ్? ఇక ఆ అబ్బాయి మన అమ్మాయిని తీసుకుని తనింటికి ఎందుకు వెళ్ళలేదు? రేపు అతను తాను ఒక్కడూ తనింటికి వెళతాడు. దీన్ని తీసుకువెళ్ళడు. దేనికంటావ్? ఎందుకంటావ్? రేపు వాళ్ళు తమ ఆస్తిలో వాటా ఇవ్వమన్నారనీ, లేకపోతే ఏవేవో అబద్ధాలు చెప్పి ముందుగా మన అమ్మాయినీ, ఆ తరువాత మనల్నీ ఆట ఆడిస్తే మనమేం చెయ్యాలి?"

"నేను అటువంటివాణ్ణి కాదు."

"నువ్వు వచ్చేదారిలో ఉన్న మీ స్వగ్రామానికి కూడా నీ పెళ్ళాన్ని తీసుకువెళ్ళలేదంటేనే నీ గుణం ఎటువంటిదో నేను అంచనా వేయగలుగుతున్నాను సారీ బాబూ."

"అలా అతన్నీ, దాన్నీ అనొద్దండీ. ఇద్దరూ చేసింది పొరపాటే. అలాగని వాళ్ళని తిరస్కరిస్తే మనకు మిగిలేదేమిటి?"

"నువ్వు నాకు ఏ సలహా ఇవ్వొద్దు లక్ష్మి. వీళ్ళనే కాదు. మన రాజును కూడా ఈ ఇంటికి రానివ్వను. వీళ్ళకు మన అవసరం రావాలనే సంగతి గుర్తురానప్పుడు – ఆ అవసరం ఈనాడు వచ్చిందంటే మనం వీళ్ళను ఆదరించడం తప్పే అవుతుంది"

"నా మాట వినండీ"

"ప్లీజ్. నువ్వు ఎక్కువ మాట్లాడొద్దు లక్ష్మి" అన్నాను కోపం ఆపుకుంటూ. ఆ తరువాత విమలా, శేఖర్ నా ఇంటి నుంచి వెళ్ళిపోయారు. లక్ష్మి ఏడుస్తూ పడుకుంది. నేను బాధను ఓర్చుకోలేకపోయాను. అయినా లక్ష్మిని రెండిళ్ళకూ వెళ్ళకుండా నేను కట్టడి

చేశాను. ఒట్టు వేయించుకున్నాను. లక్ష్మి కన్నీరు కార్చింది కానీ, జవాబు చెప్పలేదు నాకు!

అటు రాజు ఇంటికీ, ఇటు విమల ఇంటికీ నేను పోలేదు. వాళ్ళను మా ఇంటికి రమ్మనలేదు. పైగా లక్ష్మిని పోనివ్వలేదు. నా స్నేహితులన్నవాళ్ళు నాకు అతి దగ్గరగా వచ్చి నాకు ఎన్నో సలహాలు చెప్పారు. సానుభూతి అందించారు. కానీ, నేను మాట్లాడలేదు. ఎంతో బింకంగా నన్ను నేను అదుపులో పెట్టుకున్నాను. కానీ, వాళ్ళు వెళ్ళిన తరువాత ఆశ్చర్యంగా నేను నీరసపడేవాణ్ణి. మౌనంగా రోదించేవాణ్ణి. లక్ష్మి ఎన్నో రాత్రుళ్ళు నా ప్రక్కన చేరి నాకు నచ్చచెప్పబోయేది. నేను కోపంతో పెనుభూతంగా మారానని ఆమె అనుకుంటోందని నాకు తెలుసు. కానీ, ఆమె నిద్రపోయిన తరువాత నేను నిద్రపోలేదని, ఆ మధ్యకాలంలో కన్నీటితో నా తలగడా తడిసి ముద్దయిందని నాకు ఒక్కడికే తెలుసు. చాలామందికి ఈ విషయం తెలియదు.

నా కొడుకు కట్నం తేనందుకు నేను బాధపడలేదు. కానీ, నా కూతురికి నేనుగా ఏమీ ఇవ్వనందుకు – ఇవ్వలేని పరిస్థితుల్లో నన్ను ఇరికించినందుకు నా కూతురి మీద నాకు కోపం వచ్చింది. నా నిస్సహాయతను – కన్నబిడ్డగా ఆమె ఎండగట్టడం, ఆ తపన ఎవరికి అర్థం అవుతుంది? డబ్బు జమ చేసి ఆమెకు ఘనంగా పెళ్ళి చేయాలనే నా చిన్న ఆశ నెరవేరకపోవడం వెనుక నా అసమర్థత ఎలాంటిదో నాకే తెలుసు? రెండు పూటలా తనకు అన్నం పెట్టలేకపోతున్న నా మీదకు పరాయి మనిషిని తీసుకురావడం నిజంగా ఆమె అమాయకత్వమే అనిపించినా, నా బాధ ఆమెకు ఎందుకు అర్థం కాలేదన్నది నన్ను కాలుస్తూనే వచ్చింది. ప్రేమించినవాళ్ళకు కొంతలో కొంత గుడ్డితనం వస్తుందేమో. కానీ, ఇది గుడ్డితనం కాదు, పూర్తి అంధత్వం. ఇవే విషయాలు ఆపుకోలేక లక్ష్మి ముందు వాపోయాను మళ్ళీ!

"మనం ఏ తప్పు చేయనప్పుడు భగవంతుడే మనల్ని రక్షిస్తాడు. అలాగే తప్పు చేసినవాళ్ళు ఎవరయినా, ఎంతటివాళ్ళయినా భగవంతుడు ఊరుకోడు. ఎప్పుడో ఒకప్పుడు బుద్ధి చెప్పి తీరతాడు. ఇది నిజం".

నేను మాట్లాడలేదు ఆ క్షణం. అయినా ఆశ్చర్యం. నా గుండె మండుతూనే ఉంది. ఎవరితోనో చెప్పుకుంటే ఇది తీరేది కాదు. అది నాకూ తెలుసు. కానీ, ఏం లాభం?

❖ ❖ ❖

నిజమే. నాకు వ్యక్తీకరించడం తెలియదు. అభిమానాన్ని పెద్ద పెద్ద మాటల్లో ఉరకలు వేయించడం అంతకన్నా తెలియదు. ప్రేమ, ద్వేషం ఈ రెండు కూడా పెనుచప్పుళ్ళు అంటే ఇష్టపడవని నా నమ్మకం. నిజమే. లోలోపల నాకు లక్ష్మి అంటే ప్రేమ, రాజు అన్నా, విమల అన్నా ప్రేమే! లక్ష్మి నన్ను పెళ్ళి చేసుకుని ఎక్కడలేని కష్టాలు తన నెత్తికెత్తుకుంది. మొదట్లో ఆ కష్టాలు మా అమ్మ కలుగజేసింది. మా అమ్మకు కావలసింది

డబ్బు. ఆ డబ్బు అటు లక్ష్మి తన పుట్టింటి నుంచి తేలేదు. నేనే ఆ డబ్బేదో మా లక్ష్మికి ఇచ్చి, పుట్టింటివాళ్ళు ఇచ్చారని చెప్పిద్దామని నాకు అనిపించినా ఆ అవకాశం నాకూ దొరకలేదు. నేనూ ఏమీ అనలేనివాణ్ణి. ఇదే మా అమ్మకు అవకాశం అయింది. ఇప్పుడు ఇదే డబ్బు లేమి నా కూతురు విమలను నాకు కాకుండా చేసింది! ఎంత దౌర్భాగ్యం నాది! కాదు నేనెంత దురదృష్టవంతుణ్ణి! అయితే, నేనెంతటి దురదృష్టవంతుణ్ణో పరోక్షంగా ఓ రోజు లక్ష్మి నిరూపించింది. నేను మొదట ఆశ్చర్యపోయాను. ఆమె చాలా రోజుల బట్టి విమల ఇంటికీ, రాజు ఇంటికీ వెళ్ళి తన సహాయ సహకారాలు కన్నవాళ్ళకు అందిస్తోందిట. ఆమె ఆ పని చాలాకాలంగా చేస్తోందిట. ముఖ్యంగా నన్ను మభ్యపెట్టీ, నా దగ్గర దాచీ ఆమె కొడుకు ఇంటికీ, కూతురు ఇంటికి వెళ్ళడం! నాకు అప్పుడు కోపం రాలేదు. అసహనం వచ్చింది. కాదు, అది అసహనం కూడా కాదేమో. ఆశ్చర్యం అంతకన్నా కాదు. అది బాధ. ఎవరో నన్ను చూసి నవ్వినా, లేకపోతే నా మొహం మీదే మాట్లాడినా నేను బాధపడేవాణ్ణి కాదు. కానీ, ఈ పని లక్ష్మి చేసింది. “నువ్వు” అన్నాను అయిష్టంగా. అంతకుమించి మాటలు రాలేదు నా నోటి వెంట. “నేను” అంది లక్ష్మి. “ఇలా చేస్తావా?” ఆమె నా వైపు చూసింది. “మన రాజు, విమల నీ ఒకళ్ళకే పిల్లలనుకున్నావా? వాళ్ళు నాకేమీ కారా? వాళ్ళ మీద నాకు అభిమానం ఉండదా? కానీ, అర్హత లేనివాళ్ళ ముందు నువ్వు నీ ప్రేమను వ్యక్తీకరించావు. అది నీకు ఎలాంటి తృప్తినిచ్చిందో నాకు తెలియదు. ఎంత పొరపాటు చేశావ్ లక్ష్మీ” అనేశాను. లక్ష్మి ఏమీ మాట్లాడలేదు.

“నా పర్మిషన్ తీసుకోవాలని వీళ్ళ విషయంలో తప్ప నేను ఏనాడూ నిన్ను అడగలేదు. కానీ, ఆ పని చేశాను. నీ చేత ఒట్టు తినిపించాను. ఇవన్నీ నువ్వు మర్చిపోతావా? అదీ ఇలా... ఇది నా దురదృష్టం... ఛీఛీ, వెధవ బతుకైపోయింది నాది”.

“అది కాదండీ.”

“నీకు పిల్లల మీదే గానీ నా మీద ప్రేమ లేదనే విషయం నాకిప్పుడే తెలిసింది. ఐయామ్ వెరీ సారీ.” లక్ష్మి తల వంచుకుని అంది. “కాదండీ, ఆ పిల్లలు ఎవరు? మన పిల్లలు. మీరు కాదన్నంత తేలిగ్గా వాళ్ళని నేనుకాదనలేకపోయాను. మీ మీద ప్రేమ ఉంది. వాళ్ళ మీదా ప్రేమా ఉంది. ఇది ఏ తూకానికీ అందదు. కానీ, మగవాళ్ళు కొన్ని పన్లు చేస్తారు. పంతానికి పోగలరు. ఆడవాళ్ళు ఆ పన్లు చెయ్యలేరు. ముఖ్యంగా తల్లి అయిన ఏ ఆడదీ చెయ్యదు. మీరు నన్ను క్షమించండి. మిమ్మల్ని గాయపరిచాను. కాని, నాకు అయిన గాయం గురించి ఎవరితో చెప్పుకోను? అది రోజు రోజుకూ పెద్దదవుతుంటే, ఏ మందులకూ, మనశ్శాంతికీ అందకపోతుంటే భరించలేక నేను అటు వెళ్ళాను. మీరు నన్ను క్షమించరనీ, నేను తప్పు చేస్తున్నాననీ తెలియకపోవడమే – ఆపేక్ష నన్ను పిల్లల దగ్గరకు తీసుకు వెళ్ళిందండీ. పిల్లలకు చెబితేవాళ్ళు నవ్వుతారు. ఆడదానికి తల్లి అవడం

నిజంగా అదృష్టం, దురదృష్టం రెండూ కూడా అని నిన్ననే తెలిసింది."

ఆ పైన బావురుమంది. వెక్కివెక్కి ఏడ్చింది. పైట కొంగు ఆ కన్నీటితో ముద్ద అయింది. ఆ పైన వంటింట్లోకి వెళ్ళిపోయింది. నేను ఆ గదిని చూశాను.

ఆ గది కన్నీటి ఆనవాళ్ళు మిగుల్చుకునే ఉన్నట్టు అనిపించింది. కానీ, నా కోపాన్ని ఆ నిశ్శబ్దం ఏమార్చలేదు. లేచి లక్ష్మి గది దగ్గరకు వెళ్ళి, "జరిగిందేమో జరిగింది. ఎప్పుడూ ఈ పొరపాటు చేయవద్దు నువ్వు. నేను బతికుండగా, కాదు నేను చనిపోయినా నువ్వు ఈ పని చేయడం నాకు మనశ్శాంతి ఇవ్వదు" అన్నాను.

నేను ఆవేశంతో, కోపంతో పెద్ద పొరపాటు చేశానని, ఓ తల్లి హృదయాన్ని గాయపరిచానని నాకు తెలియలేదు. శిఖరాగ్రానికి చేరిన నాకోపం నేలని తాకని మూలంగా, చిటారు కొమ్మలనెక్కిన నా అసహనం మానుకు చేరడం తెలియని మూలంగా నేనెంతో నష్టపోయిందీ ఆ క్షణాన నాకు తెలిసిరాలేదు. తెలిసిన క్షణం పిల్లలూ, వాళ్ళకు పుట్టిన పాపలూ నాకు కాకుండా పోవడమే కాక, నా ప్రాణంలో ప్రాణం అయిన లక్ష్మి మంచం పట్టింది. మందులకు అందని రోగంతో, నాతో మాట మాత్రం చెప్పకుండా ఓ రోజు లక్ష్మిపోయింది!

ఆ క్షణాన ఏం చేయాలో తోచలేదు. నాకు ఎవరూ లేరనే బెంగ, అందరూ ఉన్నా నేనెవరికీ అక్కరలేదనే దిగులు నన్ను చేదు మనిషిని చేశాయి. అదీ కాదు,ఎవరు లేకపోయినా లక్ష్మి ఉంటే నాకు ఈ దిగులు తెలిసేది కాదనే సత్యమూ నాకు తెలిసొచ్చింది. నాకు అతి దగ్గరగా, అదీ నలభై ఏళ్ళు నాతో మసలిన లక్ష్మి అలా హఠాత్తుగా దూరం అవడం నాకు తీరని లోటు అయిందని నాకు అప్పుడు తెలిసొచ్చింది. బాధని దిగమింగుకోవడం ఎలాగో నాకు తెలియలేదు!

నన్ను ఎందరో వచ్చి పలకరించారు. అందులో స్నేహితులు, ప్రాణ స్నేహితులు, ఆప్తులూ ఉన్నారు. తక్కువమంది పరిచయస్తులూ ఉన్నారు. ఇంకా నా కొడుకు, కోడలు, కూతురు, అల్లుడూ ఉన్నారు. అందరూ నాతోపాటు దుఃఖాన్ని పంచుకున్నారు. కానీ, పంచుకున్నకొద్దీ అది ఎక్కువ అవుతూనే వచ్చింది. వచ్చినవాళ్ళలో ఎవరో సానుభూతిగా అన్న మాటలు నా చెవిన పడ్డాయి. నా గుండెల్ని తాకాయి. బాధను రెట్టింపు చేశాయి. "నీకు ఎన్నో అపరాధాలు చేశాను. క్షమించి, మన్నించు అని ప్రతీ భర్తా ఎప్పుడో ఒకప్పుడు, ఆఖరికి కాటిలోనయినా భార్యతో చెప్పి తీరతాడు. మనవల్ల చాలాసార్లు కన్నీరు పెడతారు ఆడవాళ్ళు. కానీ, మగవాళ్ళమయిన మనం వాటిని సమయానికి గుర్తించలేం. అది మన దౌర్భాగ్యం" అని. నాకు ఆ క్షణాన ఆ మాటలు ఎందుకో పచ్చినిజాలు అనిపించాయి. అందుకేనేమో ఆ నిజాల్ని జీర్ణం చేసుకోలేక మరోసారి ఉవ్వెత్తున నా కళ్ళు కన్నీటిని కార్చాయి... తల వంచుకోవలసి వచ్చింది. తప్పలేదు.

❖